సాక్షి
వనపర్తి
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



ఆటల్లో పైపైకి..
ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఈ ఏడాది వివిధ క్రీడల్లో పైచేయి సాధించారు.
వివరాలు 8లో ▸



అక్రమాలకు చెక్
గ్రామపంచాయతీల్లో ఈ–గ్రామ స్వరాజ్ యాప్‌తో అక్రమాలకు చెక్ పడినట్లయింది.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /15.3
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్ ఇవ్వకుంటే ఆర్‌ఆర్ యాక్ట్ అమలు

వనపర్తి: నిబంధనల మేరకు సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై ఆర్‌ఆర్ యాక్ట్ అమలు చేస్తామని కలెక్టర్ తేజస్ పవార్ హెచ్చరించారు. శనివారం ఈ విషయమై కలెక్టరేట్‌లో పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మిల్లర్లు ఇవ్వాల్సిన బియ్యం, 26 ఏసీకేల కంటే ఎక్కువ బియ్యం ఇవ్వాల్సిన వారి వివరాలు అందజేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువు లోగా బియ్యం ఇవ్వకుంటే ఆర్‌ఆర్ యాక్టు అమలు చేసేందుకు వారి ఆస్తుల వివరాలు సేకరించాలన్నారు.

● జిల్లాలో మొత్తం 146 మిల్లులు ఉండగా.. 8 మిల్లులపై 6–ఏ కేసులు ఉన్నాయి. మరో 25 మంది మిల్లర్లు నిబంధనల మేరకు ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇప్పటికే అప్పగించారు. వందకుపైగా మిల్లర్లు 26 ఏసీకేల కంటే ఎక్కువ బియ్యం ఇవ్వాల్సి ఉంది. వారిపై చర్యలు తప్పవంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించరాదని స్పష్టం చేశారు.

సీఎంఆర్‌పై మంత్రి వీడియో కాన్ఫరెన్స్..
అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి పెండింగ్ సీఎంఆర్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిల్లర్లు ఇవ్వాల్సిన బియ్యం గడువు ఈ నెల 31తో ముగుస్తుందని.. కచ్చితంగా రికవరీ ఉండాలని ఆదేశాలిచ్చారు. కలెక్టర్ తేజస్ పవార్ వీసీలో పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. నిర్లక్ష్యం చేసే మిల్లర్లపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, పౌరసరఫరాలశాఖ డీఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్..
సాధారణ, ప్రజాపాలన విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించారన్న కారణంతో చిన్నంబావి మండలం కాలూరు పంచాయతీ కార్యదర్శి కె.వీరేష్‌కుమార్‌ను శనివారం రాత్రి కలెక్టర్ సస్పెండ్ చేశారు. సదరు పంచాయతీ కార్యదర్శి సమాచారం ఇవ్వకుండా మండలాన్ని విడిచి వెళ్లరాదని సస్పెండ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గురుకులాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్టీ గురుకులాల ఆర్సీఓ నాగార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో జనవరి 6వ తేదీ వరకు చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సైబర్ పంజా

పెరిగిన నేరాలు..తగ్గిన ప్రమాదాలు


మొజర్ల సమీపంలో బుర్రవాగులో పడిన వాహనం (ఫైల్)



- పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు
- 199 రోడ్డు ప్రమాదాల్లో 113 మంది దుర్మరణం

వనపర్తి: జిల్లాలో ఏటా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోంది. 2022లో 36 కేసులుండగా.. 2023లో ఆ సంఖ్య 48కి పెరగటం, హైదరాబాద్ టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి జిల్లాకు సంబంధించి 249 ఫిర్యాదులు రావటం సైబర్ భూతం తీవ్రతను తెలియజేస్తోంది. సైబర్ నేరగాళ్లు 2023లో రూ.1.09 కోట్లను స్వాహా చేసినట్లు పోలీస్ అధికారుల వార్షిక నివేదికలో పేర్కొన్నారు. వీటితో పాటు వివిధ నేరాలు, కేసులు, చోరీలు, ఆస్తి తగాదాల కేసులు పెరిగాయి. 2022లో నేరాల సంఖ్య 2,045 ఉంటే.. 2023లో ఆ సంఖ్య 3,932కు పెరిగింది. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదాలు, అత్యాచారాలు తగ్గటంతో పాటు శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి.

రివైండ్ 2023

మెరుగుపడిన రికవరీ..

2023లో ఆస్తి నేరాల రికవరీ 41 శాతం నుంచి 53 శాతానికి పెరిగింది. మొత్తం 137 కేసులు నమోదు కాగా.. కోల్పోయిన ఆస్తి విలువ రూ.1.03 కోట్లు ఉంది. ఇందులో రూ.54.07 లక్షలు రికవరీ చేశారు.

● జిల్లాలో రెండుచోట్ల 4.2 కిలోల గంజాయి పట్టుబడగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మత్తు పదార్థాల వినియోగం, సరఫరాను కట్టడి చేశారు.

ప్రమాదాలు, హత్యలు..

గతంతో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలు తగ్గాయి. 2022లో 207 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 125 మంది మృతిచెందారు. 2023లో 199 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా.. 113 మంది మృతిచెందారు.
2022లో 11 హత్య కేసులు నమోదు కాగా.. 2023లో 9 జరిగాయి.
2022లో 4, 2023లో రెండు అత్యాచార కేసులు నమోదయ్యాయి.

జిల్లాలో కేసుల నమోదు ఇలా..

కేసులు	సంవత్సరం	
	2023	2022
దోపిడీలు	4	1
చోరీలు	134	138
హత్యలు	9	11
అపహరణలు	37	25
మోసాలు	108	118
వరకట్న హత్యలు	-	1
గృహహింస	57	63
పీడీఎస్ బియ్యం	30	47
ఇసుక అక్రమ రవాణ	55	65
ఆస్తి తగాదాలు	120	137
మహిళలపై నేరాలు	60	95
బాలికలపై దాడులు	23	26
డ్రంకెన్ డ్రైవ్	467	187
పేకాట	19	19
మొత్తం కేసులు	3,932	2,045

26 పోక్సో కేసులు..

జిల్లాలో 26 పోక్సో కేసులు నమోదయ్యాయి. మదనాపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల 6 నెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

560 అవగాహన సదస్సులు..

సైబర్ నేరాల బారిన పడొద్దని జిల్లాలో ఇప్పటి వరకు 560 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఎస్పీ రక్షిత కె.మూర్తి వెల్లడించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ రామదాసు తేజావత్, సీఐలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సైబర్ నిందితులను పట్టుకోవటం, నగదు రికవరీ చేయడం ఆలస్యమవుతుందని వివరించారు. ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేసే వారు సైబర్ నేరాలకు పాల్పడుతుంటారని.. డెబిట్, క్రెడిట్ కార్డులు, బ్యాంకు ఖాతా వివరాలను గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పొద్దని, యాప్‌లలో వచ్చే సందేశాలకు స్పందించొద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే ఫిర్యాదు చేస్తే.. నగదు డ్రా చేయకుండా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు..
కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్పీ సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ నెల 31 అర్ధరాత్రి అన్ని ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి.. చిత్రంలో ఏఎస్పీ, సీఐలు

పాలమూరులోనే ఉన్నత విద్య

విద్యారంగంలో పెనుమార్పులు

ఉమ్మడి జిల్లాకు ఉన్నత విద్యా మండళ్లు వరుస కట్టాయి. పాలమూరులో గత నాలుగేళ్ల క్రితమే వైద్య కళాశాల ఏర్పాటు కాగా.. ఈ ఏడాది నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. అలాగే విద్యాపర్తిగా పేరుగాంచిన వనపర్తికి జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల మంజూరవగా.. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. ఇక ప్రాథమిక విద్యకు సైతం మహర్దశనే పట్టిందని చెప్పవచ్చు. 'మన ఊరు–మనబడి', 'మన బస్తీ– మన బడి' పేరిట శిథిల పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దగా.. ఉదయం అల్పాహారం, రాగిజావతో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడంతోపాటు తల్లిదండ్రుల దృష్టిని ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షిస్తోంది. మొత్తంగా విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువచ్చిన 2023 సంవత్సరంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్


మహబూబ్‌నగర్‌లోని షాబజార్ పాఠశాలలో రాగిజావా పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్, వైద్య, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- 'మన ఊరు– మన బడి' పథకంతో శిథిల పాఠశాలలకు మహర్దశ
- ఉదయం అల్పాహారం, రాగిజావాతో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి
- ప్రభుత్వ స్కూళ్ల వైపు మరలిన తల్లిదండ్రుల దృష్టి

ప్రభుత్వం విద్యారంగంలో 2023 సంవత్సరం సమూల మార్పులు తీసుకువచ్చింది. పేద విద్యార్థులకు చదువును మరింత చేరువ చేసే విధంగా అనేక కొత్త పథకాలు అమల్లోకి వచ్చాయి. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టిని మరల్చేందుకు అనే సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పన కోసం మన ఊరు– మన బడి, మన బస్తీ– మన బడి కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వం శిథిల పాఠశాలలకు రూ.లక్షల్లో నిధులు కేటాయించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని 291 పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.142 కోట్లు వెచ్చించి.. డ్యూయెల్ డెస్కులు, బోర్డులు, మరుగుదొడ్లు, ఇతర పూర్తిస్థాయి వసతులు కల్పించింది. ఉమ్మడి జిల్లాకు కొత్తగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, వైద్య, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసింది. పాలమూరు యూనివర్సిటీ పరిధిలో మొత్తం 5 జాతీయ సదస్సులు.. ఎంవీఎస్, ఎన్టీఆర్ కళాశాలల్లో 2 చొప్పున సదస్సులు నిర్వహించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇప్పటి వరకు మధ్యాహ్న భోజనం అందించిన ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఉదయం పూట పూరి, దోశ, ఇడ్లీ, వడ వంటి నాణ్యమైన టిఫిన్ అందించేందుకు నవంబర్‌లో నియోజకవర్గానికి 2 పాఠశాలలను ఎంపిక చేశారు. అయితే ఈ పథకం ఉమ్మడి జిల్లాలోని 64 పాఠశాలల్లో మాత్రమే కొనసాగుతుంది. అలాగే ఉదయం పూట రాగి జావా వడ్డించే విధంగా చర్యలు తీసుకున్నారు. పథకంలో భాగంగా సోమ, బుధ, గురువారం గుడ్డు ఇస్తుండగా.. మంగళ, గురు, శనివారాల్లో రాగిజావాను అందిస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసిన రాగిజావా తయారీ సామగ్రి

గందరగోళంగా బదిలీలు..

ఉమ్మడి జిల్లాలో సుమారు 13 వేల మంది ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ప్రక్రియ ప్రారంభించిన ప్రభుత్వం.. మరోసారి అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా చేపట్టింది. కానీ, కోర్టు కేసుల కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. 2021లో బదిలీలు చేపట్టిన ప్రభుత్వం వివిధ స్థాయిల్లో సకాలంలో పూర్తిచేయలేకపోయింది. దీంతో ఎస్‌ఏలు, హెచ్‌ఎంలు, ఎంఈఓ, డైట్, బీఈడీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యా వ్యవస్థపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేక చదువులు సరిగా సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే ఖాళీ పోస్టులు భర్తీ చేసి.. బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రెండు భాషల్లో పుస్తకాలు..

ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తుంది. అయితే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు చదువుకునేందుకు అనువుగా ఉండేలా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పుస్తకాలు పంపిణీ చేసింది. అంతేకాకుండా పుస్తకాన్ని రెండు భాగాలుగా విభజించి రెండుసార్లు ముద్రించి రెండు విడతల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు కొనడం భారమైన నేపథ్యంలో నోట్ పుస్తకాలను సైతం ఉచితంగా పంపిణీ చేసింది. అయితే జిల్లాలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో నోట్ పుస్తకాలు అందలేదు.

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో..

ఉమ్మడి జిల్లాలోని వనపర్తిలో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కొత్త ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభించింది. అలాగే మహబూబ్‌నగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇక నాలుగు డిగ్రీ గురుకులాలు, మక్తల్, ధన్వాడలకు డిగ్రీ కళాశాలలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 6 జూనియర్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేయగా.. ఒక్క మహబూబ్‌నగర్‌లోనే మహమ్మదాబాద్, చిన్నచింతకుంటకు కళాశాలలు వచ్చాయి. నారాయణపేట మినహా అన్ని జిల్లాల్లో మెడికల్ కళాశాలలను సైతం అందుబాటులోకి రావడంతో వైద్య విద్యకు మరింత ప్రాధాన్యత పెరిగింది. ఇక పాలమూరు యూనివర్సిటీలో ఈ సంవత్సరం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎంసీఏ రెండు కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు.

■ ఇంటర్మీడియట్, ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు ఆశించిన మేర ఫలితాలు సాధించలేకపోయాయి. ఆరు కేజీబీవీలు, గురుకులాల్లో మాత్రం వందశాతం ఫలితాలు వచ్చాయి. అలాగే ఎంసెట్, నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడంతో ఉమ్మడి జిల్లాలోని మెడికల్ కళాశాలల్లోనూ సీట్లు పొందారు.

సజావుగా దరఖాస్తుల స్వీకరణ


బుద్దారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ పవార్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కలెక్టర్ తేజస్ పవార్

గోపాల్‌పేట: ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ పవార్ తెలిపారు. శనివారం మండలంలోని బుద్దారంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఏవైనా ధ్రువపత్రాలు లేకపోయినా, ఇతర సమస్యలున్న వారి నుంచి సైతం ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీది పేదల పక్షమని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతామని చెప్పారు. గతంలో అధికారంలో ఉండి పనులు చేయడం చేతగానివారు ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని ప్రచారం చేస్తున్నారని.. పని చేయకుండా ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకొనే పార్టీలకు మరోసారి ఛాన్స్ రాదని ఎద్దేవా చేశారు. స్వీకరించిన దరఖాస్తులను 100 రోజుల్లో పరిశీలించి పథకాలను అమలు చేస్తామని చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే అయిపోదని.. ప్రతి మూడునెలలకు ఒకసారి స్వీకరిస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన బుద్దారం గండి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సవ్యంగా 'ప్రజాపాలన'..
ఆత్మకూర్/అమరచింత: ప్రజాపాలన గ్రామసభలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం ఆత్మకూర్ పుర వార్డులు, మండలంలోని బాలకిష్టాపూర్, కత్తేపల్లి, అమరచింత మండలం కిష్టంపల్లిలోని గ్రామసభలను పరిశీలించి దరఖాస్తుదారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడోరోజు శనివారం ప్రజాపాలన గ్రామసభలకు 22,008 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 50,647 దరఖాస్తులు అందినటు వెల్లడించారు. ప్రతి కుటుంబానికి దరఖాస్తు పత్రాలను కౌంటర్ వద్ద ఉచితంగా అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు దరఖాస్తులను నిశితంగా పరిశీలించి తీసుకోవాలని సూచించారు. ఆది, సోమవారం గ్రామసభలకు విరామం ఉంటుందని.. దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దని సూచించారు. కుటుంబ యజమాని రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆత్మకూర్‌లో మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పుర కమిషనర్ నాగరాజు, ఎస్‌ఐ నరేందర్, ఆయాశాఖల అధికారులు, అమరచింతలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీపీఓ సురేష్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి స్వరణ్‌సింగ్, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నర్సింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బాలకిష్టాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

రాజీమార్గంలో కేసుల పరిష్కారం


జిల్లాకేంద్రంలో జరిగిన లోక్ అదాలత్‌లో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత



ఆత్మకూర్ కోర్టులో న్యాయమూర్తి శిరీష, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత

వనపర్తిటౌన్: ఇరువర్గాల అంగీకారంతో రాజీమార్గంలో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవచ్చని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంతో సమయం ఆదా కావడంతో పాటు మానసిక స్థైర్యం చేకూరుతుందన్నారు. న్యాయం జరుగుతుందంటే కక్షిదారులు ఎంత దూరమైన వచ్చేందుకు సిద్ధంగా ఉంటారని.. అందుకు న్యాయస్థానాలు, లోక్‌అదాలత్ శిబిరాలు ప్రథమ వేదికలని చెప్పారు. లోక్‌అదాలత్‌లో భరణం, విద్యుత్, ప్రమాదాలు, క్రిమినల్, సివిల్, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు మొత్తం 2,166 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు భారీగా తరలిరావడంతో కోర్టు ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు వి.రజని, బి.రవికుమార్, అదనపు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి జానకి, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1,137 కేసులు పరిష్కారం..
ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్ విజయవంతమైంది. న్యాయమూర్తి శిరీష మాట్లాడుతూ.. కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్షణికావేశంలో ఘర్షణలకు పాల్పడి కోర్టుల చుట్టూ తిరగడంతో విలువైన సమయం వృథా అవుతుందని.. రాజీమార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. వివిధ రకాల క్రిమినల్ కేసులు, డ్రంకెన్ డ్రైవ్, ఇతర పోలీస్ కేసుల ద్వారా రూ.8.32 లక్షల జరిమానాలు విధించారు. 1,137 కేసులు పరిష్కరించి కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు తిప్పారెడ్డి, జీకే రాములు, న్యాయవాదులు నారాయణగౌడ్, దివాన్జీ అశోక్ కుమార్, గంగాధర్‌గౌడ్, రామేశ్వర్‌రెడ్డి, బీపీ రత్నం, విజయభాస్కర్‌రెడ్డి, ముక్తేశ్వర్, ఏపీ రాజేందర్, కృష్ణ, కిషోర్, విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, అబ్రహం, మన్యం, వినోద్, వర్కటం శ్రీనివాస్‌రెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది రూప, రాణి, విద్యావతి ఆయా మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంది క్వింటా రూ.8,770

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కందులకు క్వింటాల్ గరిష్టంగా రూ.8,770, కనిష్టంగా రూ.7,855 ధర లభించింది. అదేవిధంగా వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ.7,769, కనిష్టంగా రూ.6,166 ధర దక్కింది. ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్టంగా రూ.3,209, కనిష్టంగా రూ.2679, హంస రకానికి గరిష్టంగా రూ.2,040, కనిష్టంగా రూ.2,000, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,267, కనిష్టంగా రూ.2,222, ఆముదాలు రూ.5,272, పత్తి గరిష్టంగా రూ.6,689, కనిష్టంగా రూ.3,590, రాగులు రూ.3,639, మినుములు రూ.8,887 ధరలు లభించాయి.

ఆముదాల ధర రూ.5,350
దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,350, కనిష్టంగా రూ.5,209గా ధరలు లభించాయి. కందుల ధర గరిష్టంగా రూ.8,839, కనిష్టంగా రూ.8,619గా ధరలు నమోదయ్యాయి. సీజన్ తగ్గడం వల్ల మార్కెట్‌కు 400 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

నయా జోష్!

మహబూబ్‌నగర్ క్రైం: కొత్తసంవత్సరం వేడుకలకు ఉమ్మడి పాలమూరు జిల్లా యువత సిద్ధమవుతోంది. ఈసారి వేడుకలకు ఆదివారం కూడా కలిసిరావడంతో ఉత్సాహం మరింత రెట్టింపుకానుంది. అయితే న్యూ ఇయర్ వేడుకల కోసం మద్యం దుకాణాదారులు లిక్కర్‌ను భారీస్థాయిలో దిగుమతి చేసుకున్నారు. మద్యం ప్రియులను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలో ఉన్న 230 మద్యం దుకాణాల నిర్వాహకులు కొత్తకోట, తిమ్మాజిపేట దగ్గర ఉన్న డిపోల నుంచి మూడు రోజుల్లో రూ.42.26 కోట్ల విలువైన లిక్కర్ స్టాక్‌ను దుకాణాల్లో నిల్వ చేసుకున్నారు. ఇందులో ఐఎంఎల్ 42,472 కేసులు ఉంటే.. బీరు 50,988 కేసులు ఉన్నాయి. ఆదివారం కూడా మరో రూ.20 కోట్ల మద్యం స్టాక్‌ను దుకాణాల నిర్వాహకులు దిగుమతి చేసుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది 31 వేడుకలకు ప్రభుత్వం మద్యం దుకాణాలకు అర్ధరాత్రి 12 వరకు, బార్‌లకు అర్ధరాత్రి ఒంటిగంట వరకు అనుమతి ఇచ్చారు.

తేదీ	ఐఎంఎల్	బీర్	నగదు (రూ.కోట్లలో)
డిసెంబర్ 28	7,087	8,535	6.80
డిసెంబర్ 29	12,285	15,466	12.24
డిసెంబర్ 30	23,100	26,987	23.22

ఆటల్లో పైపైకి..


మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు (ఫైల్)

క్రీడారంగంలో ఉమ్మడి జిల్లాకు మెరుగైన ఫలితాలు

- మూడేళ్ల తర్వాత ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ పోటీలు
- పలు రాష్ట్రస్థాయి టోర్నీలకు ఆతిథ్యమిచ్చిన పాలమూరు
- ఆలిండియా యూనివర్సిటీ వాలీబాల్ జట్టుకు అనన్యశ్రీ ప్రాతినిధ్యం
- రాష్ట్రస్థాయి టోర్నీల్లో చాంపియన్, రన్నరప్‌గా నిలిచిన జిల్లా జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఈ ఏడాది క్రీడా పోటీల్లో ఉమ్మడి పాలమూరుకు మెరుగైన ఫలితాలు వచ్చాయి. కరోనా మహమ్మారితో 2020 నుంచి 2022 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు బ్రేక్ పడింది. మూడేళ్ల తర్వాత ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీల నిర్వహణకు మహబూబ్‌నగర్ వేదికైంది. టోర్నీలను విజయవంతంగా నిర్వహించడంలో జిల్లాకు మంచి పేరు ఉంది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పలు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వహించారు.

రివైండ్ 2023

ఉమ్మడి జిల్లా జట్ల సత్తా

రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17, 19 విభాగాల అంతర్ జిల్లాల క్రీడా టోర్నీల్లో జిల్లా జట్లు సత్తా చాటుతున్నాయి. ఈ ఏడాది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన అండర్–19 విభాగంలో సిద్దిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు చాంపియన్లుగా నిలిచాయి. తొర్రూర్‌లో బీచ్ వాలీబాల్‌లో బాలుర జట్టు విజేత, మహబూబ్‌నగర్‌లో జరిగిన హ్యాండ్‌బాల్‌లో బాలుర విన్నర్‌గా, బాలికల జట్టు మూడోస్థానం, సదాశివపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీలో బాలుర జట్టు రన్నరప్, గజ్వేల్‌లో జరిగిన నెట్‌బాల్ టోర్నీలో బాలుర జట్టు చాంపియన్‌గా, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచాయి. అదే విధంగా తొర్రూర్‌లో అండర్–17 రగ్బీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా, బాలుర జట్టు మూడోస్థానం, అండర్–14 రగ్బీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా, బాలుర జట్టు మూడోస్థానం, ఇబ్రహీంపట్నంలో అండర్–14 నెట్‌బాల్‌లో బాలుర జట్టు విన్నర్, అండర్–17లో బాలుర జట్టు ద్వితీయ, నిర్మల్‌లో అండర్–17 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో బాలికల జట్టు ద్వితీయ స్థానం, హన్మకొండలో అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీలో బాలుర జట్టు విజేతగా నిలిచాయి. అండర్–17, 14 విభాగాల్లో ఉమ్మడి జిల్లా బాల, బాలికల హాకీ జట్లు చాంపియన్లుగా, అండర్–17 రాష్ట్రస్థాయి ఖోఖో ఉమ్మడి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, అండర్–14 వాలీబాల్‌లో బాలుర జట్టు విన్నర్‌గా, బాలికల జట్టు మూడోస్థానంలో నిలిచాయి.


రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో కబడ్డీ ఆడుతున్న బాలికలు


గజ్వేల్‌లో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌లో విజేతగా ఉమ్మడి జిల్లా బాలుర జట్టు


మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో జరిగిన ఈషా గ్రామోత్సవంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)


మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో అండర్–19 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీ విన్నర్ ఉమ్మడి జిల్లా బాలుర జట్టు (ఫైల్)


మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో అండర్–19 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలు (ఫైల్)


సిద్దిపేటలో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్‌లో విన్నర్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు (ఫైల్)

పతకాలతో ప్రతిభ

ఫిబ్రవరి 18 నుంచి 20వ తేదీ వరకు కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జరిగిన 15వ సౌత్ జోన్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎం.వినోద్, ఎస్.కృష్ణ, మహ్మద్ రేహాన్ లు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. వరంగల్‌లో జరిగిన 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు అండర్–18లో సాయి సంగీత 200మీ.పరుగులో బంగారు పతకం, 100 మీ. పరుగులో రజత పతకం, కె.శివకుమార్ 400మీ.పరుగులో బంగారు పతకం, ఎం.నిఖిల్ ట్రిపుల్ జంప్‌లో రజత, సాయికుమార్ 300 మీ. పరుగులో రజత పతకం సాధించారు.

■ అక్టోబర్‌లోరాజాపూర్‌లో అండర్–17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. 13 నుంచి 15 వరకు ఖిల్లాఘనపురం మండలం సోలీపూర్‌లో అండర్–17 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలు జరిగాయి.



■ జూలై 3న జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మహబూబ్‌నగర్ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. 13న జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ నిర్వహించారు. మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ తొలిసారిగా విదేశీగడ్డపై వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. చైనా దేశం చెంగ్డ్ నగరంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 7 వరకు జరిగిన 'వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్'కు ఎంపికైంది. కేరళ యూనివర్సిటీ నుంచి చైనాకు వెళ్లే ఆలిండియా యూనివర్సిటీ వాలీబాల్ జట్టుకు అనన్యశ్రీ ప్రాతినిధ్యం వహించింది.

■ నవంబర్ 10 నుంచి 12 వరకు మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్– 19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి బాలుర జట్టు చాంపియన్‌గా, బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మెయిన్ స్టేడియంలో 11 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. గద్వాలలో అండర్–14 రాష్ట్రస్థాయి బాలుర ఫుట్‌బాల్ టోర్నీ జరిగింది.

■ ఆగస్టులో పుదుచ్చేరిలో 3 నుంచి 6 వరకు జరిగిన 28వ సబ్‌జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అరవింద్ నాయుడు, రాఘవేందర్, లోకేష్ పాల్గొన్నారు. 11న మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో మొదటిసారిగా ఈశా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, త్రోబాల్ పోటీలు జరిగాయి.


■ మే నెల 15 నుంచి 17 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. 22 నుంచి 24 జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు జరిగాయి. 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగిన సీఎం రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా పురుషుల జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి చాంపియన్‌గా నిలిచింది.

■ డిసెంబర్ మాసంలో జడ్చర్లలో అండర్–17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ విజేతగా నిలిచింది. గద్వాలలోని స్టేడియంలో 15 నుంచి 18 వరకు అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాలుర క్రికెట్ పోటీలు నిర్వహించగా ఉమ్మడి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో, గద్వాల, నారాయణపేటలో పలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. అన్నింటిలోనూ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు.

చిన్నరాజమూర్‌లో భక్తుల కిటకిట


దేవాలయం వద్ద భక్తుల సందడి


ప్రత్యేక అలంకారంలో చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయ స్వామి దేవాలయం శనివారం భక్తులతో కిటకిట లాడింది. బ్రహ్మోత్సవాలలో మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దేవాలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి, అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పల్లకీసేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయం వద్ద స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. దేవస్థానం వారు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లను చేశారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు..

భక్తులు స్వామి వారికి ఎంతో ఇష్టమైన దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కోనేరు వద్ద పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించారు. కొందరు పొర్లు దండాలతో, మరికొందరు గండజ్యోతులతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి వారికి ఆవులను, కోడెలను సమర్పించుకున్నారు.

భూగర్భ జలవిద్యుత్ కేంద్రం పరిశీలన


భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట: టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించారు. కేంద్రం మొత్తం తిరిగి ప్రతి యూనిట్ పనితీరు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంపై ఆరా తీశారు. 2020 ఆగస్టులో చోటుచేసుకున్న ప్రమాదం వివరాలను తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పత్తి అవుతున్నప్పుడు బ్యాటరీలను మార్చడం వల్ల ప్రమాదం జరిగిందని అధికారులు తెలియజేశారు. అంతకుముందు సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ(ఓఅండ్‌ఎం) ఆదినారాయణ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లికార్జున్, మోయిజ్, కె.వెంకట్, రవి, పార్థసారధి, కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడలు


క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

కల్వకుర్తి: చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 67వ రాష్ట్ర స్థాయి మల్లకంబ్ అండర్ 14, 17 క్రీడలు శనివారం ముగిశాయి. మల్లకంబ్ రాష్ట్రా స్థాయి క్రీడలకు ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని మల్లకంబ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడలో మొదటి స్థానం హైదరాబాద్, రెండో స్థానం మెదక్ జిల్లాలు విజయం సాధించారని తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అండర్ 14 విభాగంలో సిద్ధు, అండర్ 17 విభాగంలో రాము, కల్వకుర్తికి చెందిన అనూశ్రీ అండర్ 17 విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 8 నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో కొనసాగే క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారుల ఎంపికపై పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో టీచర్ ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: ఓ ఉపాధ్యాయుడు అప్పులు తీర్చలేక ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... పట్టణంలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా తెలిసిన వ్యక్తుల వద్ద కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు తీసుకున్నాడు. చెల్లింపుల విషయంలో జాప్యం జరగడంతో అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన పురుగు మందుతాగి ఆత్మహత్య యత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి ప్రాణాపాయం లేదని తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు మృతి

మహమ్మదాబాద్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గండేడ్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దామరగిద్ద మండలం విఠలాపూర్‌కు చెందిన గూడెపు రాములు (64) ఈనెల 24న ఉదయం గండేడ్ మండలం కొండాపూర్‌కు వచ్చాడు. తన కూతురును చూసి తిరిగి వెళ్తుండగా కప్లాపూర్ వద్ద బైకు అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్ పంపించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు బోసప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి

మహమ్మదాబాద్: దంపతులపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు శనివారం కేసునమోదు చేశారు. గండేడ్ పరిధిలోని పంచలింగాల్ తండాకు చెందిన సరోజ ఈనెల 24న ఇంట్లో ఉండగా కోస్గి మండలం పోలేపల్లి తండాకు చెందిన వెంకట్, కామ్య మరికొందరు వచ్చారు. భర్త పెంట్యానాయక్ ఎక్కడున్నాడని అడగడంతో పాటు.. అసభ్య పదజాలంతో దూషించారు. మార్గమధ్యలో సల్కర్‌పేట్ వద్ద పెంట్యానాయక్ వస్తుండగా అడ్డుకుని అకారణంగా కొట్టారు. దీంతో సరోజ ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

కారుబోల్తా - ముగ్గురికి గాయాలు


చిన్నవడ్డేమాన్ సమీపంలోని మన్నెపు వాగులోకి పల్టీ కొట్టిన కారు.


కారు ప్రమాదంలో గాయాలైన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: అతివేగంగా వెళ్తూ కారు వాగులో పల్టీ కొట్టి బోల్తా పలువురికి గాయాలైన ఘటన శనివారం చిన్నవడ్డేమాన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నెల్లికొండి గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డి, వెంకటేష్, సునీల్‌కుమార్‌లు శనివారం గ్రామం నుంచి చిన్నచింతకుంటకు కారులో వెళ్తున్నారు. చిన్నవడ్డేమాన్ గ్రామ సమీపంలోని మన్నెపువాగు బ్రిడ్జి వద్ద మూలమలుపు ఉండడంతో కారు వెళ్తూ అదుపుతప్పి వాగులోకి పల్టీకొట్టింది. ఈ సంఘటనలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, కారులో రవికుమార్‌రెడ్డి, వెంకటేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సునీల్‌కు స్వల్ప గాయాలు కాగా, వారిని స్థానికులు మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అధికారులు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే..

కారు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

సోలార్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: మండల పరిధిలోని గగ్గలపల్లి సమీపంలోని సోలార్ ప్లాంట్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి కృష్ణమూర్తి తెలిపిన సమాచారం మేరకు.. సోలార్ ప్లాంట్‌లో ప్రమాదశాత్తు ఎండుగడ్డికి నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ప్లాంట్‌లో సోలార్‌పేట్లతో పాటు వైర్లు, ప్లాస్టిక్ పైపులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ.9లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు.

కందిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


అలంపూర్‌లో సాగుచేసిన కందిపంట


మారుక మచ్చ పురుగు ఆశించిన కందిపంట

- మారుక, పచ్చ పురుగులతో పంటకు నష్టం
- రైతులు ముందుజాగ్రత్తలు పాటించాలి
- వ్యవసాయ ఏడీఏ సక్రియనాయక్

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: కంది సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. సాగు చేసిన కందిపంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉందని.. పంటకు మారుక (బియ్యం పురుగు), పచ్చ పురుగు ఆశిస్తుందని పేర్కొన్నారు. ఈ పురుగుతో పూత, పిందె దశలో ఉన్న పంటకు అపారనష్టం చేకూరుతోందన్నారు. రైతులు ముందు జాగ్రత్తలు పాటించి, వాటి నివారణ పద్ధతులు పాటించాలని సూచించారు.

మారుక మచ్చల పురుగు (బియ్యం పురుగు): మారుక మచ్చల పురుగు లేత పిందెలు, పూతను చుట్టగా చేసుకుని పంటకు నష్టం చేస్తోంది. ఈ పురుగు వల్ల ఫలదీకరణ దెబ్బతిని, కాయలు కాకుండా ఉంటాయి. తద్వారా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నివారణ: మారుక మచ్చల పురుగుతో పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉండటంతో రైతులు నివారణ చర్యలు తీసుకోవాలి. థయోడికార్బ్‌ను ఒక గ్రాము లేదా స్పినోసాడ్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమయడ్ 0.3 మీ.లీ. మందు, రెనాక్సీపైర్ 0.3 మీ.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అదే విధంగా నువాన్ ఒక మి.లీ. మందును లీటర్ నీటిలో కలిపి పిచుకారీ చేయడం వల్ల చుట్ట లోపల ఉన్న మారక పురుగు నాశనమవుతుంది.

పచ్చపురుగు: తల్లిపురుగు బంగారు రంగు గల గుడ్లను లేత పిందె, పూత మీద వేస్తుంది. ఈ గుడ్ల ద్వారా ఆశించిన పురుగులు పూత, పిందె, కాయలను తొలుస్తాయి. వీటి నివారణకు చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగితే కాయలను అమాంతం నాశనం చేస్తాయి.

నివారణ: క్లోరోపైరిఫాస్ 3 మీ.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం లేదా నొవాలుకాన్ ఒక మీ.లీ. మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. నొవాలురాన్, ఇండాక్సికార్బ్ ఒక మీ.లీ. లీటర్ నీటిలో కలిపి లేదా రెనాక్సిపైర్(కొరాజెన్) 0.3 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

పోషకాలను అందించాలి: పూత, పిందె దశలో ఉన్న పంటకు పోషకాలను అందించాల్సి ఉంటుంది. అయితే పోషకాలను ఆకుల ద్వారా అందించాలి. 14:0:35 ఐదు గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడంతో పంటకు మంచి పోషకాలు అందుతాయి.

రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే

ఎక్కువ మందికి పెన్షన్లు ఇచ్చేది కూడా మనందరి ప్రభుత్వమే

- పెన్షన్ రూ.3 వేలకు పెంపు సందర్భంగా లబ్ధిదారులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ



సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు దేశంలో రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని, ప్రజలందరి ఆశీస్సులతోనే ఇదంతా చేయగలుగుతున్నాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి మొదలయ్యే పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వం అవ్వాతాతల పెన్షన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచుతున్న సందర్భంగా ఆయన రాష్ట్రంలో దాదాపు 66 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు లేఖలు రాశారు. ఒకటవ తేదీన వలంటీర్లు లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్ డబ్బులు అందజేస్తూ, వారికి ముఖ్యమంత్రి రాసిన లేఖ ప్రతులను అందజేయనున్నారు. ఇప్పటికే ఆ లేఖల ముద్రణ పూర్తయి, జిల్లాల వారీగా వాటిని చేర్చే ప్రక్రియను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పూర్తి చేసింది. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమేనని, మనందరి ప్రభుత్వమే ఇవన్నీ చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నట్టు సీఎం జగన్ ఆ లేఖలో తెలిపారు. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటున్నట్టు కూడా పేర్కొన్నారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది.

ప్రియమైన అవ్వాతాతలకు..

మీకు, మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఈ రోజు 2024 జనవరి 1 నుంచి.. ఇచ్చిన మాట ప్రకారం.. ఇక మీ చేతికి అందే పెన్షన్ రూ.3000 అవుతుంది. నా సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో నోరు తెరిచి అడగలేని ఎంతో మంది అవ్వాతాతలను, దురదృష్టవశాత్తు భర్తను కోల్పోయి జీవితాన్ని భారంగా నెట్టుకొస్తున్న వితంతువులను.. కష్టాలు, కన్నీరు తుడిచే వారు లేక దుఃఖంలో ఉన్న దివ్యాంగుల కన్నీటి వ్యథలను నేను స్వయంగా చూశాను. మీ మనవడిగా, మీ బిడ్డగా, మీ సోదరుడిగా ఆ మాటకు కట్టుబడి.. మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్టు తు.చ. తప్పక పెన్షన్‌లను పెంచుకుంటూ మీ అందరి ఆశీర్వాదంతో, దేవుడి దయతో అందిస్తునందుకు సంతోషిస్తున్నాను. ఈ పెన్షన్ పెంపుతో మేనిఫెస్టోలో ఇచ్చిన నూరు శాతం హామీలు అమలు చేశామని చెప్పడానికి గర్వపడుతున్నాను.

చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు వరకు పింఛన్ కేవలం రూ.1,000 ఉండేది. ఆ ఐదేళ్లలో ఒక్కో అవ్వాతాతల కుటుంబానికి ఇచ్చిన పెన్షన్ రూ.58 వేలు. అదే మీ జగన్ తన నాలుగున్నర ఏళ్ల పాలనలో ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.47 లక్షలు. దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ ఏకంగా రూ.1.67 లక్షలు. రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు అర్హులైన మరో 28.35 లక్షల మందికి.. కొత్తగా పెన్షన్‌లు మంజూరు చేశాం. ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్న వారి సంఖ్య దాదాపు 66 లక్షలని చెప్పడానికీ సంతోషిస్తున్నాను.

గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ, పెన్షన్ మంజూరు కావాలంటే నరకమే. పెన్షన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు, పెన్షన్ తీసుకోవడానికీ లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు. కానీ, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన.. అది ఆదివారమైనా, మరే ఇతర సెలవు రోజైనా సరే సూర్యోదయంతోనే మీ ఇంటి తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెపుతూ మన వలంటీర్లు మీకు పెన్షన్ అందిస్తున్నారు. పెన్షన్ కోసం పడిగాపులు పడి, ఎక్కడో ఉన్న కార్యాలయం చుట్టూ తిరిగిన గత ప్రభుత్వ విధానాలకు.. మనందరి ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రధానమైన తేడా.. మనది మనసున్న ప్రభుత్వం. మనది పేదలు, మహిళలు, రైతుల పక్షపాత ప్రభుత్వం.

దేశంలోనే రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏదైనా ఉందంటే అది మన రాష్ట్రమని, ప్రజలందరి మన ప్రభుత్వమే ఇది చేయగలుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమే. మీ ఆశీస్సులతోనే ఇదంతా చేయగలిగాను.

మీ ఆశీస్సులు, మీ మద్దతే నా బలం. ఆ బలం వల్లే కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్న ఈ సందర్భంలో ఇలాంటి మంచి ప్రయత్నాలను కొనసాగించగలిగాను. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు మంచి జరగాలని.. ఆ దేవుడి దయ ఉండాలని కోరుకుంటున్నాను. దేవుడి దయతో, మీ అందరికి ఇంకా ఎంతో మంచి చేసే అవకాశం రావాలని మనసారా కోరుకుంటూ.. మరోసారి మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ప్రేమతో మీ..
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా...

జనవరిలో 'తిరుమల' విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి నెలలో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్‌వో విభాగం శనివారం ప్రకటించింది. 1న పెద్దశాత్తు మొర, వైకుంఠ ద్వార దర్శనం ముగింపు, 5న అధ్యయనోత్సవాల ముగింపు, 6న తిరుమల శ్రీవారు తిరుమలనంబి సన్నిధికి వేంచేపు, 7న సర్వఏకాదశి, 9న తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 14న భోగిపండుగ, ధనుర్మాసం ముగింపు, 15న మకర సంక్రాంతి, సుప్రభాత సేవ పునఃప్రారంభం, 16న తిరుమల శ్రీవారు పార్వేట మండపానికి వేంచేపు, కనుమ పండుగ, 25న శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి, 28న తిరుమొళిశైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 31న కూరత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం జరగనున్నాయి.

శ్రీశైల దేవస్థానంలో 'ప్రాతః కాలసేవ'

- జనవరి 3 నుంచి అమలు
- ఆన్‌లైన్‌లో రోజుకు 5 టికెట్లు మాత్రమే



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో జనవరి 3వ తేదీ నుంచి స్వామి అమ్మవార్లకు నూతనంగా ప్రాతఃకాల ఆర్జిత సేవ అందుబాటులోకి రానుంది. రోజుకు ఐదు టికెట్లు అందుబాటులో ఉండనుండగా, సేవా రుసుం రూ.25,116గా నిర్ణయించారు. టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే విక్రయిస్తారు. ఈ సేవలో దంపతులు లేదా ఒకరికి మాత్రమే అనుమతి. 10 సంవత్సరాల్లోపు పిల్లలుంటే మల్లికార్జున స్వామి వారి స్పర్శదర్శనం మాత్రమే కల్పిస్తారు. సేవలో భాగంగా మొత్తం ఆరు సేవలను నిర్వహించుకోవచ్చు. దీనిపై దేవస్థాన ఈఓ డీ పెద్దిరాజు మాట్లాడుతూ భక్తుల సూచనలు, సలహా మేరకు ఈ ఆర్జిత సేవను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

'సామాజిక' జైత్రయాత్ర

నంద్యాల, గుంటూరు జిల్లా తాడికొండ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఉత్సాహంగా సాగిన సామాజిక సాధికార యాత్రలు

సభలకు పోటెత్తిన బడుగు, బలహీనవర్గాలు

జై జగన్.. జైజై జగన్ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణాలు

సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్న నేతలు

పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికల్లో పేదల పక్షపాతి అయిన సీఎం జగన్ వెంట నిలవాలని పిలుపు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీ

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే గ్రూప్–2, గ్రూప్–1, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు భర్తీకి చర్యలు తీసుకున్న ఏపీపీఎస్సీ.. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 11 సబ్జెక్టుల్లో 240 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించింది. పోస్టులు, విద్యార్హతలు, వేతనం, తదితర వివరాలతో కూడిన పూర్తి సమాచారాన్ని సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో జనవరి 24 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొంది. పోస్టులకు సంబంధించి అభ్యర్థులు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇందులో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (పేపర్–1) 150 మార్కు లకు డిగ్రీ స్థాయిలో ఉంటుంది. పేపర్–2 సంబంధిత సబ్జెక్టు పీజీ స్థాయిలో 150 ప్రశ్నలు 300 మార్కులకు ఉంటుంది. తప్పు సమాధా నానికి మైనస్ మార్కులు ఉంటాయని కమిషన్ పేర్కొంది. అభ్య ర్థులు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. పరీక్షల సబ్జెక్టు సిలబస్ https://psc. ap.gov.inలో చూడవచ్చు.

ఏ సబ్జెక్టులో ఎన్ని పోస్టులు

సబ్జెక్టు	పోస్టులు
బోటనీ	19
కెమిస్ట్రీ	26
కామర్స్	35
కంప్యూటర్ అప్లికేషన్స్	26
కంప్యూటర్ సైన్స్	31
ఎకనామిక్స్	16
హిస్టరీ	19
మ్యాథమెటిక్స్	17
ఫిజిక్స్	11
పొలిటికల్ సైన్స్	21
జువాలజీ	19
మొత్తం	240



శనివారం తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ దర్శించుకున్నారు. తిరుమలలో శుక్రవారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారిని 56,200 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో కానుకలుగా రూ.3.89 కోట్లు సమర్పించారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

గద్వాల రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం గద్వాల మండలం సంగాలలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పథకాలపై క్షేత్రస్థాయిలో చాలామందికి అవగాహన లేకపోవడంతో అర్హులకు లబ్ధి చేకూరడం లేదన్నారు. పథకాలు గ్రామీణస్థాయిలో చేరాలనే సంకల్ప్ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. పథకాలపై డిజిటల్ స్క్రీన్‌లో లఘుచిత్రం ద్వారా అవగాహన కల్పించారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ అయ్యపురెడ్డి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అనిల్, జెడ్పీ సీఈవో కాంతమ్మ, బీజేపీ నాయకులు బలిగెర శివారెడ్డి, మిర్జాపురం రాంచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, రామాంజనేయులు, రజక నర్సింహ, హనుమంతరాయ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ఊరేగిన పడమటి అంజన్న



శేషవాహన సేవలో పాల్గొన్న భక్తులు

మక్తల్ పడమటి ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం శేష వాహన సేవ నిర్వహించారు. భాజాభజంత్రీల మధ్య ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని పల్లకీపై ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీమాచారి, ఈఓ సత్యనారాయణ, పూజారి ప్రాణేష్‌కుమార్, అరవిందకుమార్, భీంరెడ్డి పాల్గొన్నారు.

– మక్తల్

అక్రమాలకు చెక్



పద్మన్నపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

- 'ఈ–గ్రామస్వరాజ్' యాప్‌లో పక్కా సమాచారం
- గ్రామపంచాయతీ పూర్తి వివరాలు నమోదు
- నిధుల విడుదల, ఖర్చుతో సహా తెలుసుకునే సౌకర్యం

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ–గ్రామస్వరాజ్ యాప్‌తో పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పడినట్లయ్యింది. పంచాయతీకి వచ్చే ప్రతి పైసా వివరాలు ఇట్టే తెలిసిపోతోంది. కార్మికుల జీత భత్యాలతో సహా అభివృద్ధి పనులకు వెచ్చించే నిధుల వివరాలను ప్రతి ఒక్కరూ తెలుసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. గతంలో గ్రామపంచాయతీకి వచ్చే నిధులు, ఆదాయం, ఖర్చు వివరాలను తెలుసుకోవాలంటే కార్యాయానికి వెళ్లి అధికారులతో ఆరా తీయాల్సి వచ్చేది. లేదా సమాచార హక్కు చట్టంతో అర్జీ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అధికారులు ఇచ్చే సమాచారంలో స్పష్టత ఉండేది కాదు. వీటిన్నింటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట ఈ–గ్రామస్వరాజ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జీపీకి సంబంధించిన ప్రతి లెక్కను యాప్‌లో పక్కాగా నమోదు చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో ఈ యాప్ ద్వారా పంచాయతీ పూర్తి సమాచారాన్ని సులభంగా తెలుసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. కాగా దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో పంచాయతీ ఆదాయ, వ్యయాలను తెలుసుకోలేకపోతున్నారు.

వివరాలిలా తెలుసుకోవాలి..

సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్‌లో ఈ–గ్రామస్వరాజ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం ,గ్రామం ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత అందులో పూర్తి సమాచారం క్లుప్తంగా నమోదై ఉంటుంది. తద్వారా పంచాయతీ పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

తప్పులకు తావులేకుండా..

పంచాయతీ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. పంచాయతీలో పొరపాట్లకు తావులేకుండా ప్రతి పైసాను లెక్క ప్రకారం ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఏమైనా తప్పుడు నివేదికలు చూపిస్తే ఈ–గ్రామస్వరాజ్ యాప్ ద్వారా ప్రశ్నించవచ్చు.

అన్ని వివరాలు తెలుసుకోవచ్చు..

గ్రామపంచాయతీ అభివృద్ధి, ఆస్తుల వివరాలు ఈ–గ్రామస్వరాజ్ యాప్‌తో సులభంగా తెలుసుకోవచ్చు. ప్రతి పనిని ఇందులో పొందుపరుస్తారు. కార్మికుల వివరాలతో పాటు జీత భత్యాలు ఉంటాయి. ఎలాంటి తప్పులకు తావు లేకుండా మూడేళ్లుగా నమోదు చేస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– దేవయ్య, ఎంపీడీఓ, బల్మూర్

పక్కా సమాచారం..

గ్రామపంచాయతీకి సంబంధించిన అభివృద్ధి, ఆర్థిక పురోగతి, ఆస్తుల నిర్వహణ, జియో ట్యాగింగ్ లాంటి వివరాలను యాప్‌లో నిక్షిప్తంగా పొందుపర్చాల్సి ఉంటుంది. గ్రామ పాలకమండలి పేర్లతో సహా పంచాయతీ కార్యదర్శి వివరాలు, నిధుల మంజూరు, ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారు? పనుల పురోగతి వంటి అంశాలు సైతం ఉంటాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా వ్యయాలు, అభివృద్ధి పనుల నివేదికలు యాప్‌లో క్లుప్తంగా ఉంటాయి. జీపీఆర్ఎస్ ద్వారా పనులను గుర్తించడం వల్ల ఒక్కసారి చేసిన పనులకు మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలుండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వివరాలు.. ఎంపిక చేసిన పనులకు ఎంత ఖర్చు చేశారు? కార్మికుల వేతనాలు ఇతర ఖర్చులు వంటి సమాచారం సైతం ఇందులో పొందుపరుస్తారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఈ–గ్రామస్వరాజ్ యాప్ ద్వారా అమలు చేస్తున్నారు.

జూరాల నీటి కోసం రైతుల తంటాలు



పెబ్బేరులోని ప్రధాన కాల్వ వద్ద నీటిని మళ్లిస్తున్న రైతులు

పెబ్బేరు రూరల్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కోసం రైతులు తంటాలు పడుతున్నారు. మండలంలోని సూగూరు, కొత్తసూగూరు, జనుంపల్లి, మునుగమోనిదిన్నే, పెంచికలపాడు, ఈర్లదిన్నె, బునాదిపురం గ్రామాల పరిధిలోని డి–19 కాల్వ కింద రైతులు 1,500– 2,000 ఎకరాల వరకు మిరప, మినుముల పంటలు సాగు చేశారు. అయితే కాల్వకు నీటి విడుదల నిలిపివేయడంతో ఆయా పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ప్రజాప్రతినిధుల చొరవతో అధికారులు శనివారం పెబ్బేరులోని జూరాల ప్రధాన కాల్వకు తక్కువ మొత్తంలో నీటిని వదిలారు. ఆ నీరు కూడా డి–19 కాల్వకు నీరు అందకపోవడంతో పంటలను కాపాడుకోవడానికి ఆయా గ్రామాల రైతులు ట్రాక్టర్లలో ఇసుక సంచులు తెచ్చి ఎక్కడికక్కడ కాల్వకు అడ్డు వేస్తూ.. నీటిని మళ్లించారు. చివరికి కొద్దిపాటిగా కాల్వ నీళ్లు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అలరించిన సదర్ ఉత్సవాలు

కోస్గి: మండల కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాలు అలరించాయి. యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో భాగంగా పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం దగ్గర దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం డోలు వాయిద్యాల మధ్య స్థానిక శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. సదర్ కన్వీనర్ మన్నె నరేష్ యాదవ్, జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, తాలుకా అఖిల భారత సంఘం అధ్యక్షుడు బస్వరాజ్, యూత్ అధ్యక్షుడు రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి



దున్నపోతు విన్యాసాలు

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ ఎంపికలు



హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో అధికారులు

- రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతగా నిలవాలి
- జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడల్లో జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగం ఉమ్మడి జిల్లా బాల, బాలికల హ్యాండ్‌బాల్ ఎంపికలు చేపట్టారు. ఎంపికల్లో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 120 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మాట్లాడుతూ నిరంతరం క్రీడల్లో సాధన చేస్తే నైపుణ్యంగల క్రీడాకారులుగా ఎదగవచ్చని అన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, పీఈటీలు సత్యనారాయణ, శంకర్, గణేశ్వరి, బాల్‌రాజు, ఆసిఫ్, ప్రదీప్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా అండర్–17 హ్యాండ్‌బాల్ బాలుర జట్టు

కే.రక్షిత్, ఏ.రాఘవతేజ్, ఎం.సుక్కురాం, కే.అశోక్, ఎండీ.సమీ, పీ.శ్రీను, వీ.సాత్విక్, ఎండి.సఖిబుద్దీన్, సీ.శివకుమార్, డీ.సాయికుమార్, కే.పవన్, ఎండి.షఫివుర్ రెహమాన్, కే.ప్రశాంత్, బీ.ప్రేం వసంత్, డీ.చరణ్, ఎండి.సాద్ అహ్మద్.

బాలికల జట్టు..

జే.నందిని, జే.సరిత, ఎం.శ్రావణి, డీ.కృష్ణవేణి, కే.అమూల్య, ఎం.రాధిక, కే.లక్ష్మీప్రియ, కే.సునీత రెడ్డి, కే.భావన, బీ.దీక్షిత, పీ.భవిత, ఆర్.శ్రీజ, ఈ.భార్గవి, సోని, కే.రాజేశ్వరి, శ్వేత.